క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని 69 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ సతీష్, కాంగ్రెస్ నాయకులు శేషారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలరాం, సదానందం, బాలకిషన్, జైపాల్, శ్రీనివాస్, చెన్నప్ప, చంద్రశేఖర్, ప్రభు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులపై అవగాహన : ఎంపీడీఓ

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల్లో ప్రజలకు ఈజీఎస్ పనులపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రఫిఖ్ ఉన్నీసా అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు, ఉద్యాన పంటలు ఏర్పాటుపై ప్రజలకు వివరించాలన్నారు. దీంతో పాటు గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యాన్ని సక్రమంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ విఠల్ రెడ్డి, ఏపీఓ నవాజుద్దీన్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

పెద్దశంకరంపేట(మెదక్): పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని మండల నోడల్ అధికారి వెంకటేశం అన్నారు. శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక నిధులు కేటాయిస్తుందని, మధ్యాహ్న భోజనం, ఉచిత విద్య అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణాగౌడ్, ఉపాధ్యాయులు సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్లుగా పనిచేస్తున్న వీహెచ్‌పీ: రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): విశ్వహిందు పరిషత్ 60 ఏళ్లుగా హిందు ధర్మం కోసం కృషి చేస్తుందని వీహెచ్‌పీ ప్రాంత సహ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రఖండ అధ్యక్షుడు సోమ సురేశ్, విభాగ్ సంఘటన కార్యదర్శి మల్లేశం, గవ్వలపల్లి గ్రామ ప్రముఖులు యాదవరావు, నరేందర్, బాబురావు, వీహెచ్‌పీ నాయకులు నీలశ్యామ్, రవీందర్, విశ్వనాథం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో జెఎల్ఎంగా పనిచేస్తూ విధినిర్వాహణలో చనిపోయిన గణేశ్ కుటుంబానికి అతడి బ్యాచ్‌మేట్స్, సిబ్బంది శనివారం రూ.66,251 ఆర్థికసాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ నవాజ్, రమేష్, సురేష్, కిరణ్, రామకృష్ణ, సాయిలు, సాదత్‌హుస్సేన్, ఫణిందర్, రమేశ్, తుల్జారాం తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మానెపల్లి ఉన్నత పాఠశాలను శనివారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి సందర్శించారు. పాఠశాలలోని సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది కొరతను డీఈఓ దృష్టికి తీసుకెళ్లి రెగ్యూలర్ ఉపాధ్యాయులను నియమించేలాపాటుపడతానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కౌసల్య, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

చిలప్‌చెడ్(నర్సాపూర్): సీఎం రేవంత్‌రెడ్డి రుణ మాఫి చేయడం హర్షనీయమని అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి తెలిపారు. శనివారం గ్రామస్తులతో కలిసి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని పైతర గ్రామంలోని గ్రామపంచాయతీ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి అనిల్, నాయకులు, పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ ధర్మకర్త కిషన్‌రావు ప్రత్యేక పూజలను నిర్వహించారు.



నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట శనివారం వైద్యుల నిరసన



రామాయంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు



కొడిపల్లి(నర్సాపూర్): విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

విధులు బహిష్కరించి.. నిరసన తెలిపి

ఓపీ సేవలు బంద్
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

నర్సాపూర్: కోల్‌కత్తాలో మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య చేసిన సంఘటనను ఖండిస్తూ వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మీర్జానజీంబేగ్‌తో పాటు ఇతర వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీల ధరించి నిరసన వ్యక్తం చేశారు.

రామాయంపేటలో ..

రామాయంపేట(మెదక్): కోల్‌కత్తా సంఘటనకు నిరసనగా రామాయంపేటలో ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు, ఇతర సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో..

మెదక్ కలెక్టరేట్: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం రాత్రి మెదక్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. ర్యాలీలో మహిళా మోర్చా అధ్యక్షురాలు బెండవీన, సంగీత, ఆకుల ప్రభాకర్, గీత పాల్గొన్నారు.



మెదక్ కలెక్టరేట్: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కొడిపల్లిలో..

కొడిపల్లి(నర్సాపూర్): కోల్‌కత్తా సంఘటనకు నిరసనగా కొడిపల్లిలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యసిబ్బంది విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్ ఫెర్నాజ్, సీహెచ్ఓ ఎలిజబెత్‌రాణి, స్టాఫ్ నర్స్‌లు ప్రత్యూష, సౌందర్య, శాంతి, స్రవంతి, అమృత, సులోచన, స్వప్న చంద్రకళ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేట పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థులు



చేగుంట(తూప్రాన్): రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ వేడుకల్లో విద్యార్థులు



మనోహరాబాద్(తూప్రాన్): రంగాయపల్లిలో..



కొడిపల్లి(నర్సాపూర్): కంచన్‌పల్లి పాఠశాలలో ..

జిల్లా వ్యాప్తంగా శనివారం పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తోటి విద్యార్థులకు పూలు, ఆకులతో చేసిన రాఖీలు కట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దాడులు చేసినా.. అవమానించినా శిక్షార్హులే: జడ్జి

నర్సాపూర్: ఆడపిల్లలపై దాడులు చేసినా.. అవమానించినా చట్టరీత్యా కఠినంగా శిక్ష పడుతుందని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత హెచ్చరించారు. శనివారం కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె హాజరై, మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు తెల్ల కాగితాలపై రాసుకుంటే అవి చెల్లవని సూచించారు. నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, ప్రజలు పాల్గొన్నారు.

సికింద్లాపూర్‌లో డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): పట్టా భూమి కబ్జాను అడ్డుకున్న మహిళలపై దాడికి పాల్పడిన సంఘటనపై తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి శనివారం విచారణ చేశారు. మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామ పరిధిలో పిట్టలవాడకు చెందిన సుశీల పట్టా భూమిని పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. అడ్డుకునేందుకు వెళ్లిన సుశీలతో పాటు ఆమె కొడళ్లు రాణి, రేఖపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన మార్కంరెడ్డి, భూపాల్‌రెడ్డి, వంశీలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి డీఎస్పీ వెంకట్‌రెడ్డి సంఘటన స్థలం వద్ద విచారణ చేసి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ మైహిపాల్‌రెడ్డి ఉన్నారు.

కల్తీలేని ఆహారానికి ప్రకృతి వ్యవసాయం

- కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంబాజీ దత్తాత్రేయనల్కర్

కొడిపల్లి(నర్సాపూర్): ప్రతీ రైతు నాణ్యమైన, కల్తీలేని ఆహారం కోసం ప్రకృతి వ్యవసాయం చేయాలని కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంబాజీ దత్తాత్రేయనల్కర్ అన్నారు. శనివారం మండలంలోని తునికివద్దగల డాక్టర్ డీ.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల సాగులో రసాయన ఎరువులు వాడొద్దని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు జీవామృతం, ఘన జీవా, బీజామృతంతో సాగు చేయాలన్నారు. చీడ పీడల నివారణకు వివిధ ఆకులతో తయారు చేసిన కషాయాలు, నీమ్ అస్త్రం వాడాలన్నారు. అనంతరం బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి విరజానందస్వామి మాట్లాడుతూ కేవీకేలో లభించే జీవన ఎరువులతో పంటలు సాగు చేయాలన్నారు. జీవన ఎరువులతో భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రవికుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రతాప్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, భార్గవి, బాగయ్య, రైతులు పాల్గొన్నారు.



తునికివద్ద రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కవితారెడ్డికి తెలంగాణ ఐకా అవార్డు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణానికి చెందిన సంఘ సేవకురాలు కవితారెడ్డికి తెలంగాణ ఐకాన్ అవార్డు- 2024 అందుకున్నారు. శనివారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా ఐకాన్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని రోజులుగా పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు పట్టు చీరలు, పుస్తె మెట్టలు, అనాథ ఆశ్రమాల్లోని పిల్లలకు, వృద్ధులకు, దివ్యాంగులకు తన వంతు చేస్తున్న సేవకు ఈ అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు.



అవార్డు అందుకుంటున్న సంఘ సేవకురాలు కవితా రెడ్డి

వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మండల కేంద్రంలో ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు మద్దతుగా నిరసన చేశారు. 24 గంటల పాటు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో అత్యవసర సేవలు మినహా సాధారణ విధులను బహిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై స్పందించి బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంగమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, గుజ్జరి అనిల్, జంగం రాఘవులు, ఫణికుమార్, రవి, ప్రకాష్, విఠల్, మహిపాల్ తదితరులు ఉన్నారు.



పెద్ద శంకరంపేటలో వైద్యుల నిరసన

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట, రంగంపేట పీఏసీఎస్, దుంపలకుంటలోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన ఎరువులను, పెస్టిసైడ్ మందులను అందుబాటులో ఉంచాలని దుకాణ యజమానులను ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు మాత్రమే విక్రయించాలన్నారు. బలవంతంగా ఇతర మందులను కట్టబెట్టొద్దని హెచ్చరించారు. గ్రామాల్లో ఏఈఓలు రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటున్నారని, రైతులు అవసరమైన సూచనలను, సలహాలను వారి ద్వారా నేరుగా కానీ, ఫోన్ ద్వారా గానీ సంప్రదించాలని సూచించారు.



ఎరువుల స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఏఓ

పాత మార్కెట్ రోడ్డుపై సంత మార్పు

నర్సాపూర్: పట్టణంలో సంతను పాత మార్కెట్ మార్గంలోకి మార్చినట్లు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. ఇరుకుగా ఉన్న రోడ్లపై సంత జరగడంతో కిక్కిరిసిన చోట ప్రజలు జేబు దొంగల బారినపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం పోలీస్‌స్టేషన్ సర్కిల్ నుంచి పోస్టాఫీస్ వరకు సంతను ప్రతీ శుక్రవారం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కాగా కొత్తగా మంగళవారం సైతం సంత నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇదిలాఉండగా సంతను పాత మార్కెట్ రోడ్డుకు మార్చడంపై మార్కెట్ రోడ్డులోని పలువురు వ్యాపారులు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్లు రాంచందర్, యాదగిరి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి తదితరులను శాలువాలతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.



నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌ను సన్మానిస్తున్న వ్యాపారులు

ఫాంహౌజ్‌లు కేంద్రంగా పేకాట

నర్సాపూర్: ఫాం హౌజ్‌లను కేంద్రాలుగా చేసుకొని కొందరు పేకాట నిర్వహిస్తున్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని నర్సాపూర్, శివ్వంపేట, కొడిపల్లి, హత్నూర మండలాలు హైదరాబాద్‌కు చేరువలో ఉన్నాయి. కొందరు పేకాట నిర్వహించే వ్యక్తులు ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లోని ఫాంహౌజ్‌లను అద్దెకు తీసుకొని పేకాట నిర్వహిస్తున్నారు. పలు పేకాట స్థావరాలపై పోలీసులు తనిఖీలు చేసి, కేసులు నమోదు చేశారు. పలు స్థావరాలపై మొక్కుబడిగా కేసులు నమోదు చేశారని, పోలీసు సిబ్బంది అండదండలతోనే ఈ ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల నర్సాపూర్, హత్నూర మండలాల సరిహద్దు గ్రామాల్లోని ఓ ఫాంహౌజ్‌లో నిర్వహిస్తున్నారు. తాజాగా హైదరాబాద్, సంగారెడ్డిలకు చెందిన పేకాట నిర్వాహకులు సిండికేటుగా ఏర్పడి నర్సాపూర్ మండలంలోని ఇబ్రహీంబాద్ నుంచి సిరిపుర వెళ్లే మార్గంలోని ఓ ఫాంహౌజ్‌లో కొన్ని రోజులుగా పేకాట ఆడుతున్నారు. వీరికి నర్సాపూర్‌కు చెందిన కొందరు వ్యక్తులతో పాటు అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అండగా ఉన్నారు. ఇబ్రహీంబాద్ సిరిపుర మార్గంలోని ఫాంహౌజ్‌లో పేకాట నిర్వహిస్తున్న విషయాన్ని శుక్రవారం కొందరు గ్రామస్తులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీలు చేశారు. పోలీసులు ఫాంహౌజ్‌కు వెళ్లే సరికే పేకాట ఆడుతున్న వ్యక్తులు ఫాంహౌజ్‌ను ఖాళీ చేసి వెళ్లిపోయారు.

నర్సాపూర్ సీఐ వివరణ

తమకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం ఇబ్రహీంబాద్ సిరిపుర మార్గంలోని ఫాంహౌజ్‌కు వెళ్లి తనిఖీలు చేశామని సీఐ జాన్‌రెడ్డి చెప్పారు. తాము తనిఖీలకు వెళ్లే సరికి అక్కడ ఎవరు లేరని, ఫాంహౌజ్‌లో పేకాట నిర్వహిస్తున్న ఆనవాలు కూడా లేవన్నారు. పేకాట నిర్వహించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

- ఒకే భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ, కల్లు దుకాణం
- ఇబ్బందులు పడుతున్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు

నర్సాపూర్‌రూరల్: ఒకే భవనంలో అంగన్‌వాడీ కేంద్రం, కల్లు దుకాణం కొనసాగుతున్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు, పోషకాహారాన్ని తీసుకునేందుకు వచ్చే గర్భిణులు, బాలింతలు ప్రతీరోజు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని మంతూర్ గ్రామంలో అద్దె భవనాలు దొరక్కపోవడంతో కల్లు దుకాణం కొనసాగుతున్న భవనంలోనే మరో పక్క ఖాళీగా ఉన్న గదిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. మంతూర్ అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని అసంపూర్తిగా వదిలేశారు. దీంతో కల్లు దుకాణాన్ని అనుకొని ఉన్న అద్దె భవనంలో కేంద్రం కొనసాగిస్తూ ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ టీచర్ ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా వదిలేసిన భవనం పూర్తి చేసి, తమ సమస్య పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్, గర్భిణులు, బాలింతలతో పాటు, గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై సీడీపీఓ హేమాభార్గవిని వివరణ కోరగా... నిధులు సరిపోక మంతూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారని చెప్పారు. గ్రామస్తుల సూచనల మేరకు కల్లుదుకాణం పక్కన అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నామన్నారు.





మంతూర్‌లో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణం, అంగన్‌వాడీ పిల్లలు, టీచర్

సంక్షిప్త వార్తలు

◆ రాఖీ పండుగపై అపోహలు వద్దు

శివ్వంపేట(నర్సాపూర్): రాఖీ పండుగ సందర్భంగా అపోహలు పెట్టుకోవద్దని వేదపండితుడు శాస్త్రుల వామనశర్మ అన్నారు. తప్పుడు ప్రచారం వస్తున్నందున నమ్మవద్దని సూచించారు. పంచాంగం ప్రకారం సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి వరక రాఖీ కట్టవచ్చునని చెప్పారు.

◆ ఆయూష్ ద్వారా సులువైన చికిత్స

మెదక్ మున్సిపాలిటీ: అనారోగ్య సమస్యలకు ఆయూష్ వైద్య విధానాలతో సులువైన చికిత్స చేస్తామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుమిత అన్నారు. శనివారం పట్టణంలోని గోల్కొండ వీధి కమ్యూనిటీహాల్‌లో మెదక్ ఆయూర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజిత, ఫార్మసిస్ట్ యూసుఫ్, ప్రభురెడ్డి, పెంటయ్య, లక్ష్మితోపాటు వీధిలోని వృద్ధులు పాల్గొన్నారు.

◆ జయంతిని విజయవంతం చేయాలి

నర్సాపూర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఆదివారం విజయవంతం చేయాలని గౌడ సంఘాల నాయకులు కోరారు. శనివారం గౌడ సంఘాల నాయకులు డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఆయా పార్టీల నాయకులు తదితరులు సమావేశమయ్యారు.

◆ విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతివాత పడిన సంఘటన మండల కేంద్రం శివ్వంపేటలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు ముద్దగాళ్ల బాలేష్ రోజువారిగానే పాడిగేదెలను మేత కోసం వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లారు. దీంతో విద్యుత్ స్తంభం నుంచి బోరుబావికి ఏర్పాటు చేసిన సర్వీస్‌వైర్ కోతులు తొలగించడంతో అటువైపుగా మేతకు వెళ్లిన పాడిగేదెకు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. పాడిగేదె విలువ రూ.85 వేలు ఉంటుందని, దానితోనే జీవనోపాధి అని బాధిత రైతు తెలిపాడు.

◆ 20న గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

నర్సాపూర్: తమ కాలేజీలో ఈనెల 20న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతామని అల్లూరి సీతారామరాజు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కాలేజీ ప్రిన్సిపాల్ రవి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో 20 సీట్లు, బైపీసీలో 11 సీట్లు ఖాళీ ఉన్నాయని, తొమ్మిదవ తరగతిలో 30సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

ప్రతిభ కాలేజీలో..

నర్సాపూర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ప్రతిభ కాలేజీలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 20న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ బలరాంనాయక్ తెలిపారు.

◆ నీటి సరఫరా పరిష్కారానికి చర్యలు

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని నాయిని జలాల్పూర్ గ్రామంలో తాగునీరు సరఫరా కావడం లేదంటూ శుక్రవారం ఆందోళన చేపటారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శనివారం గ్రామాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. బోరుబావి నుంచి రక్షిత మంచినీటికి పైప్ లైన్ వేసేందుకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీకాంత్ మాట్లాడారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మౌనిక, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

◆ పాఠశాలకు కోతుల వల ఏర్పాటు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాత పరంజ్యోతి కోతుల నుంచి రక్షణకు వలను ఏర్పాటు చేయించారు. కోతులు ఎక్కువగా పాఠశాల ఆవరణలోని చెట్లపై తిరుగుతూ.. విద్యార్థులను ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న దాత పరంజ్యోతి శనివారం కోతులు పాఠశాలలోకి రాకుండా రూ.15 వేల విలువగల వలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

◆ తల్లిదండ్రుల సహకారం అవసరం

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రుల సహకారం అవసరమని జెడ్పీపాఠశాల హెచ్ఎం దీప్లా రాథోడ్ అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, ఉపాధ్యాయుడు బాలు పాల్గొన్నారు.

◆ రేగోడ్ ఎస్ఐగా పోచయ్య

రేగోడ్(మెదక్): రేగోడ్ నూతన ఎస్ఐగా పోచయ్య శనివారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఇది వరకు పనిచేసిన ఎస్ఐ రాజయ్య మెదక్ ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.